ఏటూరునాగారం : ర్యాలీలో పాల్గొన్న ఏటీడీవో, ఉపాధ్యాయులు

మంగపేట : మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు

గోవిందరావుపేట : బడిబాటలో ఎంఈవో, ఉపాధ్యాయులు

గణపురం : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

# ఊరూరా బడిబాట

- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యం
- తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయులు
- వసతులు, విద్యా బోధనను వివరిస్తున్న టీచర్లు
- ములుగు, జయంశకర్ జిల్లాల్లో ర్యాలీలు
- హాజరైన విద్యాశాఖ అధికారులు

ములుగు రూరల్ : ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ గురువారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. తమ స్కూళ్లలో సాధించిన విజయాలు, బోధనా పద్ధతులు, వసతులు తల్లిదండ్రులకు వివరించి పిల్లలకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఈనెల 19 వరకు రోజుకో ప్రత్యేక కార్యక్రమంతో ముందుకు సాగనున్నారు. తొలిరోజు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు ప్ల కార్డులతో ర్యాలీలు నిర్వహించారు. ములుగులో కేజీబీవీ బాలికల పాఠశాల, కళాశాల స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ ఉపాధ్యాయులతో కలిసి ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్యను ముందుకు తీసుకెళ్లి వారి భవిష్యత్తును బంగారు మయంగా మార్చేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఇంటర్‌లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాల రక్ష భారత్ సిబ్బంది టీ రవి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏటూరునాగారం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏటీడీవో దేశిరాంనాయక్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని, పిల్లలు వారి తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పించాలని కోరారు. ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మల్లయ్య, సీఆర్‌పీ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మంగపేట మండలకేంద్రంతో పాటు కమలాపురం, మల్లూరు తదితర గ్రామాల పాఠశాలల హెచ్ఎంలు మేనక, శ్రీనివాస్, భద్రయ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలు వివరించారు. నాణ్యమైన విద్య, యానిఫాం, మధ్యాహ్న భోజనం, టాయిలెట్లు తదితర సదుపాయాలను వివరించారు. గోవిందారావుపేట మండలకేంద్రంలో నిర్వహించిన బడిబాటలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం కే రఘురాం, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఎంఈవో గొంది దివాకర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి బడిబాటలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. వెంకటాపురం (నూగూరు) మండలంలో నిర్వహించిన బడిబాటలో ఇన్‌చార్జి ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు బొల్లె శ్రీనివాసరావు, సంతోస్ పాల్గొన్నారు. గణపురం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎంలు దేసు సతీశ్‌కుమార్, దూలం కుమారస్వామిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం సీఎం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకం, వారానికి మూడు గుడ్లు, పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్‌తో పాటు ఉపాధ్యాయులు కందుకూరి నరసింహమూర్తి, రాచకొండ భాస్కర్, దాసరి చంద్రమౌళి, మడిపోజు శ్రీదేవి, పరి కి కోమల, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ దూడపాక రజిత, విద్యార్థులు పాల్గొన్నారు. టేకుమట్ల మండలంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మ, వెంకటేశ్వర్లు, మహేందర్, సాగర్, ప్రకాశ్, వేణు, సతీశ్, జ్యోతి, రమేశ్, రవి, వరప్రసాద్ పాల్గొన్నారు. వాజేడు మండల కేంద్రంలోని నాగారం ఎంపీపీఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. మొరుమురుకాలనీ, ప్రగళ్లపల్లి, చీకుపల్లి, ఇప్పగూడెం పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీలు తీశారు. ఉపాధ్యాయులు ఆనందరావు, బాలాజీ, కొట్టెం సునీత, బోదెబోయిన విజయశ్రీ, సుదేష్‌రావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలకేంద్రంలో ప్రధానోపాధ్యాయులు రాధిక, సలేంద్రం ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు జనగాం బాబురావు, వేణు, కిరణ్, ఫిరోజ్, సాంబయ్య, శ్రీనివాస్, రాజయ్య, ప్రవీణ, సీఆర్పీ కుమార్ పాండ్య పాల్గొన్నారు. చిట్యాల మండలం నైన్‌పాకలో చేపట్టిన బడిబాటలో జడ్పీటీసీ గొర్రె సాగర్ పాల్గొని కరపత్రం ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో రఘుపతి బడిబాటపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఊర్మిళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాట సందర్భంగా బండారుపల్లిలో కాళ్లు కాలి నడవలేకపోతున్న విద్యార్థినిని ముందుకు వెళ్లాలని సూచిస్తున్న ఉపాధ్యాయుడు

## చెప్పులు లేకుండా బడిబాటలో..

**విద్యార్థిని కాళ్లు కాలుతున్నా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**
**డీఈవో సాక్షిగా బండారుపల్లిలో ఘటన**

ములుగు, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ములుగు మండలం బండారుపల్లిలో నిర్వహించిన బడిబాటలో ఓ విద్యార్థిని కాళ్లకు చెప్పులు లేకుండా పాల్గొనడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. విద్యార్థులను ఇంటి నుంచి పిలిచి బ్యానర్లను పట్టించారు. సార్లు వచ్చిన భయమో భక్తో కాని ఓ విద్యార్థిని చెప్పులు లేకుండా ఎర్రటి ఎండలో బ్యానర్ పట్టుకొని వీధుల్లో తిరగడం చూసే వారిని కలతకు గురిచేసింది. కొంతదూరం నడిచిన విద్యార్థిని కాళ్లు కాలడంతో ఆగిపోగా మరికొంత దూరం వెళ్లాలని ఉపాధ్యాయులు సూచించడం చర్చనీయాంశంగా మారింది. చేసేదేమీ లేక సదరు విద్యార్థిని బడిబాట కార్యక్రమం పూర్తయ్యే వరకూ అలానే నడిచింది. డీఈవో సైతం ఈ ర్యాలీలో పాల్గొనగా ఆయన సమక్షంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

టేకుమట్ల : రాఘవరెడ్డిపేటలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

వాజేడు : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో

వెంకటాపూర్ : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిట్యాల : బడిబాటలో పాల్గొన్న జడ్పీటీసీ గొర్రె సాగర్

## అధిక ధరలకు అమ్మితే చర్యలు

**భూపాలపల్లి జిల్లా తూనికల కొలతల అధికారి శ్రీలత**

భూపాలపల్లి రూరల్, జూన్ 6: నిర్ణీత ధర కంటే ఎక్కువ రేటు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికల కొలతల అధికారి శ్రీలత హెచ్చరించారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ మైదానంలో గురువారం సాయం త్రం జరుగుతున్న సంతను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాపారుల వద్దకు వెళ్లి ధరలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీ త ధర కంటే ఎక్కువ రేటు తీసుకుంటున్న నలుగురు వ్యాపారులపై జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ణీత ధర కంటే ఎక్కువ రేటు తీసుకుంటున్నట్లు పలు ఫిర్యాదులు రావడంతో సంతను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆమె వెంట తూనికలు, కొలతల అధికారులు ఉన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న తూనికల కొలతల అధికారిణి శ్రీలత

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

టేకుమట్ల, జూన్ 6 : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాడ భాగ్యమ్మ, కుందనపల్లి గ్రామానికి చెందిన నామాని దామోదర్, ఎంపేడు గ్రామానికి చెందిన సట్ల మల్లయ్య మృతి చెందగా ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కొలిపాక రాజయ్య, కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణగౌడ్, రవి, సురేశ్, జక్కుల కిరణ్, సంగ రాజేందర్, లెక్కల రాజిరెడ్డి, గోపు భిక్షపతి, ఈర్ల సదానందం, పాల శంకర్ ఉన్నారు.


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
JANGAON - 9182777565

## గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- భూపాలపల్లి జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులను తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించాలి
- కలెక్టర్ భవేశ్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జూన్ 6 : జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షపై రూట్ ఆఫీసర్స్, అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్స్, ప్లెయింగ్ స్క్వాడ్స్, పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 4,394 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మ ధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు 9 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు ఇన్విజిలేటర్స్ అభ్యర్థుల బయో మెట్రిక్ హాజరు తీసుకుంటారని తెలిపారు. అభ్యర్థు ల సౌలభ్యం కోసం ప్రతి అరగంటకొకసారి హెచ్చరిక కోసం బెల్ మోగిస్తామని తెలిపారు. దివ్యాంగులైన అభ్యర్థులకు 50 నిమిషాలు ఎక్కువ గడువు ఇవ్వనున్నట్లు చెప్పారు. గుర్తింపు కార్డు లేని వ్యక్తులు, అనుమానిత వాహనాలను పరీక్ష కేంద్రంలో ఉండకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో రీజినల్ కో-ఆర్డినేటర్ శ్యాం ప్రసా ద్, వర్టికల్ డీఎస్పీ నారాయణ, ఏవో మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు.

### చికిత్స పొందుతూ
## వృద్ధురాలు మృతి

కొమురమ్మ (ఫైల్)

గణపురం, జూన్ 6 : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన వైనాల కొమురమ్మ (65) మృతి చెందింది. ఎస్సై సాంబమూర్తి తెలిపిన ప్రకారం.. కొమురమ్మకు ఐదేళ్ల క్రితం పక్షవాతం రాగా అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుం ది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు ములుగు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు రూరల్, జూన్ 6 : ములుగు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిపల్లి ఫీడర్ పరిధిలోని మదనపల్లి, మాధవరావుపల్లితో పాటు జిల్లా కేంద్రంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## అర్చక రత్న అవార్డుకు ఎంపికైన నాగభూషణ్‌రావు

మంగపేట, జూన్ 6 : మండలంలోని రాజుపేట వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు, ములుగు జిల్లా అర్చక సంఘ నాయకుడు కుమరాజు నాగభూషణ్‌రావు జాతీయ అర్చక రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డుకు సంబంధించిన పత్రాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సేవకులకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందించే ఈ అవార్డుకు నాగభూషణ్‌రావు ఎంపికైన సందర్భంగా మండల అర్చకులు, రాజుపేట గ్రామస్తులు అభినందించారు.

## అంబేద్కర్ నేషనల్ అవార్డుకు మల్లయ్య..

గణపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జెన్కో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిలువేరు మల్లయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు సెలక్షన్ కమిటీ చైర్మన్, నల్లా రాధాకృష్ణ నుంచి అవార్డుకు సంబంధించిన ప్రతాన్ని అందుకున్నారు. టీఎస్ జెన్కోలో చిలువేరు మల్లయ్య చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తించి ఈ అవార్డును అందజేస్తున్నట్లు రాధాకృష్ణ తెలిపారు.

మంగపేట : ఎంపిక పత్రాన్ని స్వీకరిస్తున్న నాగభూషణ్‌రావు

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో పడుతున్న వాన

## ములుగు, గణపురంలో భారీ వర్షం

ములుగురూరల్, జూన్ 6 : ములుగు జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలు, గణపురం మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో తీవ్ర ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్క సారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. 2 గంటల పాటు భారీ వర్షం కురిసి తెల్లవారే వరకు ముసురు పడింది.

గణపురంలో కురుస్తున్న వర్షం

### కాటారంలో..

కాటారం,జూన్ 6: మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని శంకరాంపల్లి గ్రామంలో పిడుగు పాటుకు మామిడి తిరుపతికి చెందిన రెండు ఎద్దులు మృతి చెందాయి. సుమారు రూ. 1.20 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు భోరున విలపిస్తూ వేడుకున్నాడు. పలుచోట్ల చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కాటారం : పిడుగు పడి మృతి చెందిన ఎద్దులు

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రణీత్ కుమార్

## ఇంటింటా జ్వర సర్వే

ఏటూరునాగారం, జూన్ 6 : మండలంలోని దొడ్ల, మల్యాల గ్రామాల్లో వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. లక్షణాలున్న వారిని గుర్తించి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. జ్వరాలపై అవగాహన కల్పించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ వర్కర్లు జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీ గ్రామాల
## అభివృద్ధికి కృషి చేయాలి

**పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్**

మంగపేట, జూన్ 6 : పెసా కమిటీలు ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ సూచించారు. మండలంలోని అకినేపల్లిమల్లారంలో గురువారం పెసా జిల్లా కోఆర్డినేటర్ డబ్బుల ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వనరులను వినియోగించుకొని ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు గిరిజనులకు చేరేలా కమిటీలు పనిచేయాలన్నారు. పెసా మొబిలైజర్ వద్ద గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలన్నారు. సమావేశంలో ఆదివాసీ హక్కుల ఉద్యమకర్త గొప్ప వీరయ్య, కుల పెద్దలు బండ్ల ముత్యపురావు, అప్పినబోయిన నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ గొప్ప చంద్రకాంత్, మొబిలైజర్లు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పూసం కార్తీక్, జోగ నరేంద్ర, తాటి విజయ్, జిగట శ్రీను, ఏటూరునాగారం పెసా కమిటీ అధ్యక్షుడు పాయం రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీని ములుగుకు తరలించాలి

ములుగు రూరల్, జూన్ 6 : జిల్లాకు మంజూరైన హనుమకొండ జిల్లా ఒగ్లాపూర్‌లో కొనసాగుతున్న గిరిజన మహిళా డిగ్రీ కాలేజీని ములుగుకు తరలించాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు కోరారు. ములుగులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజీ టు పీజీలో భాగంగా అప్పటి ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేసిందని, సరైన భవనాలు లేక ఒగ్లాపూర్‌లో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలేజీని ములుగుకు తరలించి తరగతుల కోసం భవనాన్ని కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు రవిరెడ్డి, రాకేశ్, మహేశ్, నరేశ్‌వర్మ, సిద్ధార్థ, రమేశ్, సాయి, దేవేందర్, సిద్ధు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### గొత్తికోయగూడేలకు
## విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఏటూరునాగారం, జూన్ 6 : గొత్తికోయగూడేలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు చిటమట రఘు కోరారు. పలు గ్రామాలకు చెందిన గొత్తికోయలతో కలిసి విద్యుత్ శాఖ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. అధికారులు సానుకూలంగా స్పందించినట్లు రఘు పేర్కొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

## 'విప్లవ పార్టీలకు సహకరించొద్దు'

వాజేడు, జూన్ 6 : కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న విప్లవ పార్టీలకు ఎవరూ సహకరించొద్దని వాజేడు ఎస్సై చావళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని కొంగాల గ్రామంలో గురువారం సీఆర్పీఎఫ్ బలగాలతో కలసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. మావోయిస్టులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల కూడళ్లలో మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్లను అతికించారు. అనంతరం జగన్నాథపురం వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

## అంబులెన్స్ పరికరాలపై అవగాహన

గణపురం, జూన్ 6 : మండలానికి నూతనంగా వచ్చిన నియానటల్ అంబులెన్స్‌లోని అత్యాధునిక పరికరాలపై మండల కేంద్రం, చెల్పూర్ పీహెచ్‌సీల ఏఎన్ఎంలు, ఆశలకు 108 జిల్లా మేనేజర్ మేరుగు నరేశ్ గురువారం అవగాహన కల్పించారు. అప్పుడు పుట్టిన వారి నుంచి మూడేళ్ల వరకు పిల్లలను ఆస్పత్రికి తరలించే సమయంలో పరికరాలను ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సుజాత, పైలట్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలి

గణపురం, జూన్ 6 : గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు నిరంతరం సేవ చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ చాగర్తి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆర్ఎంపీ సంఘం మండలాధ్యక్షుడు నడిగొట్టి రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ వ్యవస్థ ఇప్పుడే పుట్టలేదని, ఈ విషయాన్ని ఐఎంఏ, ఎన్ఎంసీ వైద్యులు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా దాడులు నిలిపివేసి తాము పేదలకు వైద్య సేవలందించేలా చూడాలని లక్ష్మీనారాయణ కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్, కూతురు రమణ, దౌడు రమేశ్, ధనుంజయ, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కాటారం, జూన్ 6 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ)లో ప్రవేశాలకు శుక్రవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జేకే బుచ్చయ్య తెలిపారు. ఆసక్తి గల ఎస్టీ విద్యార్థులు ఒరిజినల్ కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు.

## సైక్లింగ్ కోచ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్, జూన్ 6 : ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలో ఏర్పాటు చేసిన సైక్లింగ్ కోచింగ్ సెంటర్‌లో కోచ్‌గా పనిచేసేందుకు అనుభవజ్ఞులైన క్రీడాకారులు ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.